క్లుప్తంగా

'ఉపాధి' పనులు పరిశీలన

వేమనపల్లి: మండలంలోని చామనపల్లిలో ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న ఊట చెరువు పనులను బుధవారం ఎంపీడీవో కుమారస్వామి పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. పాఠశాల ప్రహరీ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య పనులు నిరంతరం జరిగేలా చూడాలని, నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ పోలీసుల బాధ్యత



మాట్లాడుతున్న సీఐ అఫ్జలుద్దీన్

బెల్లంపల్లి: ప్రజల రక్షణ పోలీసుల కనీస బాధ్యతని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ నంబర్-2 ఇంక్‌లైన్ బస్తీలో బుధవారం కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తనిఖీలు చేపట్టారు. తగిన ధృవీకరణ పత్రాలు లేని 45ద్విచక్ర వాహనాలను, 3 ఆటోలను సీజ్ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. నేరాల నిర్మూళన కోసమే కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై మహేందర్, తాళ్లగురిజాల ఎస్సై రమేష్, నెన్నెల ఎస్సై ప్రసాద్, సర్కిల్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీఈటీ

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు సాయికుమార్, బన్నీ జాతీయస్థాయి సబ్‌జూనియర్ నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేశ్, పీఈటీ మహేందర్ తెలిపారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 27నుంచి హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

కోటపల్లి: మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన భుక్యా సతీశ్‌కు జామీన్ పేపర్ అవసర కోసం కార్యదర్శి శంకర్‌ను సంప్రదించగా రూ.2వేలు అవుతుందని, ఇస్తేనే జామీన్ పేపర్లు ఇస్తానని నాలుగు రోజుల నుంచి ఇబ్బంది పెడుతున్నారని బుధవారం ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో అక్తర్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే కాకుండా గ్రామంలోని నిరుపేదల అవసరాలకు ఏ చిన్న పనిఉన్నా కార్యదర్శి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, గ్రామంలోని పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపించారు. డబ్బులు డిమాండ్ చేసిన కార్యదర్శి శంకర్‌పై చర్యలు తీసుకొని, సర్వాయిపేట గ్రామానికి నూతన కార్యదర్శిని నియమించాలని వేడుకున్నాడు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీఐ బాధ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రతీ విద్యార్థి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ఆర్‌బీఐ ఎల్‌డీఓ దేబోజిత్, ఎల్డీఎం తిరుపతి అన్నారు. హాజీపూర్ మండలం కర్ణమామిడిలోని కస్తూరిబా బాలికల గాంధీ విద్యాలయం(కేజీబీవీ)లో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు విధిగా బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని, బ్యాంకులు అందిస్తున్న వివిధ సేవలు, ఇన్స్రూ రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్థిక నేరాలు, సైబర్ క్రైమ్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తిరుపతి, రాజశేఖర్, రవళి, శ్రీనివాస గౌడ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వావ్.. హలీమ్

- రంజాన్ మాసంలో అధిక విక్రయాలు
- మంచిర్యాలలో వెలిసిన ప్రత్యేక కేంద్రాలు

మంచిర్యాలఅర్బన్: రంజాన్, ఈద్ సమయంలో హలీమ్ అత్యంత ప్రజాదరణ వంటకం. ఉపవాస దీక్షలు విరమించిన తర్వాత రుచికరమైన హలీమ్, హరీస్ తినటానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. హలీమ్ అనేది గోధుమ, కాయధాన్యాలు, మాంసం నుంచి తయారు చేసిన సరళమైన గంజిలాంటి(మెత్తటి)వంటకం. రోజురోజుకూ హలీమ్, హరీస్ విక్రయాలకు భలే డిమాండ్ పెరుగుతూ వస్తోంది. ముస్లింలతో పాటు ముస్లిమేతరులు సైతం కేంద్రాల వద్ద బారులు తీరులుతున్నారు. బెల్లంపల్లి చౌరస్తా నుంచి ఐబీ చౌరస్తా వరకు, రైల్వేస్టేషన్‌రోడ్‌లో విద్యుత్‌బల్బులతో హలీం కేంద్రాలను ప్రత్యేకంగా అలంకరించారు.

48 పదార్థాల వరకు వినియోగం...

హలీమ్, హరీస్ తయారు చేసేందుకు సుమారు 10నుంచి 12గంటల వరకు సమయం పడుతుంది. మాంసం, గోధుమలు, నెయ్యి, జాజికాయ, సాజిర, పాలు, గులాభిరేకులు, యాలాకులు, మొగ్గ, మిరియాలు, పూత, వాయిలోంగ్, గసాలా, మినపప్పు, మునగపప్పు, శనగపప్పు, అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయాలు, తమలపాకు ఏర్లు ఇలా 48రకాల ఆహార పదార్థాలు వినియోగిస్తూ, తయారు చేస్తుంటారు. చికెన్‌తో ఈ పధార్థాలు ఉపయోగించి హరీస్ తయారు చేయటం ప్రత్యేకత.



హలీం తింటున్న భోజన ప్రియులు



హలీం





హలీం తయారు చేస్తున్న నిర్వాహకులు



చేతి పంపునకు మరమ్మతు

భీమిని: మండలంలో తాగునీటి కష్టాలు మొదలవడంతో 'చెలిమె-చేతిపంపే దిక్కు' అనే శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి అధికా రులు స్పందించారు. బుధవారం ఎంపీడీవో గంగామోహన్ స్పందించి పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో సిబ్బంది వెళ్లి మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తెచ్చారు. దీంతో ఎస్సీ కాలనీ ప్రజలు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

బొగ్గుబాయి వార్తలు

న్యూటెక్ గనిని తనిఖీ చేసిన సేఫ్టీ జీఎం

శ్రీరాంపూర్: ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిని కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఇతర అధికారులతో కలిసి బుధవారం గనిలోకి దిగి రక్షణ చర్యలు పరిశీలించారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని ఉద్యోగులకు సూచించారు. వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరిస్తూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, గ్రూప్ ఏజెంట్ రాజేందర్, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, గని మేనేజర్ స్వామి రాజు, గని రక్షణాధికారి రమేష్ పాల్గొన్నారు.

31 వరకే మెడికల్ కార్డులకు దరఖాస్తులు

శ్రీరాంపూర్: సింగరేణిలో మెడికల్ కార్డులకు (సీపీఆర్ఎంఎస్) దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31నాటికే చివరి గడువు ఉందని శ్రీరాంపూర్ డివిజన్ (పర్సనల్) అరవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో పనిచేసే రిటైర్డ్ అయిన, అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు, మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వైద్య చికిత్సల నిమిత్తం మెడికల్ కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. దీనికి గాను ఉద్యోగి ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. ఉద్యోగి కార్డు పొందాలంటే రూ. 60000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్డులు లేని వారు ఈ నెల 31లోగా వారు పనిచేసిన గని, డిపార్టుమెంట్‌ల వద్ద అధికారులకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

వృత్తి శిక్షణ కోర్సులు సద్వినియోగం చేసుకోండి

మందమర్రిరూరల్: సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ కోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏరియాసేవా సమితి అధ్యక్షురాలు, జీఎం సతీమణి స్వరూప రాణి పేర్కొన్నారు. ఏరియాలోని సింగరేణి హైస్కూల్ ఆవరణలో బుధవారం నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ కోర్సుల కేంద్రాన్ని సందర్శించారు. కంప్యూటర్ డీసీఏ కోర్సు ముగించుకున్న వారికి పరీక్ష నిర్వహించి పరిశీలించారు. ఆమె వెంట లేడీస్ క్లబ్ మెంబర్ కవిత, మణి, శిక్షణ కేంద్రం శిక్షకురాలు ఉన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీజీఎం అరవిందరావు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని గైర్హాజరు జాబితాలో ఉన్న కార్మికులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండు రోజులుగా జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరుగుతున్న ఈ కౌన్సెలింగ్‌లో డీజీఎం(పర్సనల్) అరవిందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని, జీఎం ఆఫీస్, ఆర్కే 8 డిస్పెన్సరీ, నస్పూర్ కాలనీ డిస్పెన్సరీ, సెక్యూరిటీ విభాగాల్లో గైర్హాజరు జాబితాలో ఉన్న కార్మికులకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యోగుల గైర్హాజర్‌కు కారణాలను అడిగి తెలుసుకున్నారు. కొందరు కార్మికులు చిన్న చిన్న కారణాలతో విధులకు గైర్హాజరవుతున్నారని, ఇప్పటికైనా సక్రమంగా డ్యూటీలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, డిప్యూటీ సీఎంవో రమేష్ బాబు, డీవైపీఎం రాజేష్, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని సంక్షేమ అధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

కాసిపేట: కార్మికుల సమస్యల పరిష్కారానికి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్‌అలీ తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట 1గనిపై బుధవారం మందమర్రి బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్‌తో కలిసి గనిని సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులు చెప్పిన సమస్యలపై మాట్లాడారు. కార్మికులకు రెస్ట్ హాల్ నిర్మించాలని, సరిపడా సేఫ్టీ మెటీరియల్ అందించాలన్నారు. స్నానాలు, భోజనాలు చేసే చోట గదులు శుభ్రంగా ఉంచాలన్నారు. స్క్రాప్, మెటీరియల్ వేర్వేరుగా ఉంచాలన్నారు. గని సమస్యలపై గ్రూప్ ఏజెంట్ రాంబాబు, మేనేజర్ భూశంకరయ్యతో చర్చించి సమస్యలు పరిష్కరించడంతో పాటు ఉత్పత్తి ఉత్పాదకత సాధించేందుకు అధికారులు, నాయకులు, కార్మికులు సమన్వయ సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గని ఫిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, నాయకులు నాగేశ్వరరావు, రాజేందర్, పార్వతి సురేష్, లింగయ్య, రవీందర్, అనిల్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

'ఇన్సెంటివ్ చెల్లింపుల్లో అన్యాయం'



మాట్లాడుతున్న గుర్తింపు సంఘం నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో ఉత్పత్తి ఆధారిత స్పెషలిస్ట్(ఇన్సెంటివ్) చెల్లింపుల్లో కార్మికులకు అధికారులు అన్యాయం చేస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా బుధవారం ఓసీపీలో కార్మికులను కలిసి మాట్లాడారు. ఫిబ్రవరి నెలలో ఓపెన్ కాస్ట్‌కు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 161శాతం ఉత్పత్తిని సాధించిందని, 119శాతం బొగ్గు రవాణా చేసినట్లు తెలిపా రు. క్యాంటీన్ నిర్వహణకు కొత్త టెండర్ పిలువాలన్నారు. కార్మికులు పని స్థలాలకు చేరుకోవడానికి వాహన సదుపాయం కల్పించాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, కోశాధికారి నాగభూషణం, జీఎం కమిటీ సభ్యులు బుచ్చయ్య, రామచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, మైనింగ్ స్టాఫ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సెక్రెటరీ లచ్చన్న నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ, పీసీఆర్, పీవోఏ యాక్ట్ 1989 కేటగిరీ ఎఫ్‌లో ఐదుగురు అనధికార షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు, కేటగిరీ జి నందు ముగ్గురు నాన్ అఫీషియల్ సభ్యులు స్వచ్ఛంద సంస్థలతో సంబంధాన్ని కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీలు కాకుండా జిల్లాకు చెందిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల వారు తాము చేసిన సేవా కార్యక్రమాలతో కూడిన ఆధారాలు, పేపర్ క్లిప్పింగ్‌లు, ఫొటోలు, ఆధారాలతో ఏప్రిల్ 2న సాయంత్రం 5 గంటలలోగా జిల్లా షెడ్యూల్డ్ కులం అభివృద్ధిశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నేడు పీఎఫ్‌పై అవగాహన

మంచిర్యాలటౌన్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో 27న ఉదయం 9 నుంచి సాయంత్రం 5:45గంటల వరకు మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయంలో అవగాహన శిబిరం, ఔట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీఎఫ్ సహాయ కమిషనర్ తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యుల ఫిర్యాదుల పరిష్కార వేదికగా, సమాచార మార్పిడి నెట్‌వర్క్ ఔట్‌రీచ్ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. సభ్యులు, కార్మిక సంఘాలు వారి ఫిర్యాదులను పరిష్కరించుకోవడానికి, సూచనలు తెలుసుకునేందుకు హాజరు కావాలని కోరారు.

లేగదూడకు గాయాలు

వేమనపల్లి: మండలంలోని ఒడ్డుగూడం గ్రామ శివారులోని నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ వద్ద ఆవుదూడ తీవ్ర గాయాలపాలైంది. దీనిపై దాడి చేసింది తోడేళ్లా? లేక ఊర కుక్కల అనేది తెలియడం లేదు. గాయాలతో ఎండకు అలమటిస్తున్న లేగదూడకు స్థానికులు నీళ్ల తాగించారు. లేగదూడ ఎవరిదో తెలియరావడం లేదు. సమీప గ్రామాల ప్రజలు వచ్చి తీసుకెళ్లాలని కోరారు.

విధుల నుంచి తొలగించాలి

మంచిర్యాలఅర్బన్: గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయురాలు, విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు శ్రీనివాస్, సతీష్ డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని వీవీడీసీ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో బుధవారం హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధుల నిర్మూలనపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవగాహన కల్పించారు.ప్రతీ ఒక్కరూ ముందుకొచ్చి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథ కం కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ నారాయణ జిల్లా కన్వీనర్ చంద్రమోహన్‌గౌడ్, నిర్మల్‌జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ అర్చన, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కళాశాల ప్రోగ్రాం అధికారి షరీనా, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



గోదాం పరిశీలిస్తున్న సీఐ, తహసీల్దార్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను సీఐ నరేందర్, తహసీల్దార్ దిలీ ప్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని ఫెర్టిలైజర్ షాపులను బుధవారం తహసీల్దార్ వనజారెడ్డి, ఎస్సై శ్రీధర్, ఏవో మార్క్‌గ్లాస్టన్ తనిఖీ చేశారు. ఎ రువులు, విత్తనాలు, పురుగుల మందుల దు కాణాల్లో రికార్డులను పరిశీలించారు. నకిలీ పత్తి విత్తనాలు, గ్లైఫోసేట్ గడ్డి మందు అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూమి సుపోషణపై అవగాహన



శాస్త్రవేత్తను సన్మానిస్తున్న నిర్వాహకులు

కాసిపేట: మండలంలోని కొండాపూర్‌లో బుధవారం గ్రామ వికాస్, బెల్లంపల్లి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో 'భూమి సుపోషణ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త తిరుపతి, గ్రామ వికాస్ సభ్యులు మాట్లాడారు. నేలసారం, నీటి నిర్వహణ, జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వికాస్ జిల్లా సహాయ సంయోజక్ ఎంబడి కిషన్, జిన్నా సత్యనారాయణ, గోనె శ్యాంసుందర్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అక్షరాలు నేర్పండి



వయోజన విద్య పుస్తకాలతో అధికారులు, విద్యార్థులు

కాసిపేట: తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలన్న, సమాజంలో సగౌరవంగా నిలబెట్టాలన్నా, వారి ఆత్మగౌరవం కాపాడాలన్నా విద్యార్థులు చదువు రాని నిరక్షరాసులైన తల్లిదండ్రులకు అక్షరాలు నేర్పించాలని వయోజన విద్య జిల్లా అధికారి పురుషోత్తం నాయక్ తెలిపారు. మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం విద్యార్థులతో అమ్మనాన్న చదువుపై ముచ్చటించారు. విద్యార్థులకు వయోజన విద్య వాచకాలు, పెన్సిళ్లు, రబ్బర్లు విద్యార్థులకు అందజేశారు. డీఆర్‌పీలు విద్యార్థులకు ఎలా బోధించాలో వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వేంకటేశ్వరస్వామి, వయోజన విద్య డీఆర్‌పీలు బండ శాంకరీ, అశోక్‌రావు, సుమన్, ఉపాధ్యాయులు కృష్ణ గోపాల్, జ్యోతి, మాధవిలత తదితరులున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. నిలిచిన నీరు.. వాహనదారులు బేజారు



భీమారం: మండలంలోని కాజిపల్లి-దాంపూర్ ప్రధానరోడ్డులో రైస్‌మిల్లు సమీపంలో రోడ్డుపై నీరు నిలుస్తోంది. ఇళ్ల నుంచి వచ్చే నీటిని రోడ్డుపైకి వదులుతుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రోడ్డుపై నీరు నిలువకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : మధుసూదన్, ప్రత్యేకాధికారి, కాజిపల్లి

ఫోన్ నంబర్ : 94400 21333

అడవిలో ఫలించిన 'భగీరథ' ప్రయత్నం



జన్నారం: ఎండలు తీవ్రమవడంతో కుంటల్లో నీరు ఎండిపోతోంది.. అడవిలోని వన్యప్రాణులకు నీరందించాలనే ఉద్దేశంతో మూడు రోజులుగా అటవీ సెక్షన్ అధికారులు చేస్తున్న భగీరథ ప్రయత్నం ఫలించింది. జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి అటవీ రేంజ్, ఇందన్‌పల్లి నార్త్ బీట్‌లో నీటి ఎద్దడి రావడంతో వన్యప్రాణుల దాహర్తి తీర్చేందుకు అధికారులు బోరువేసి, సోలార్ ప్యానెల్ బిగించి, మోటార్ నుంచి నీరు పారించారు. అటవీ బీట్‌లలో నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు.

